

28న ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు

నరసాపురం : ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్, మాస్టర్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న నర్సాపురంలోని అల్లూరి సత్యనారాయణరాజు కల్చరల్ అసోసియేషన్ హాలులో ఎడ్ నూలి సాయి అభయ్ స్మారక ఆలిండియా ఓపెన్ చెస్ క్రీడాపోటీలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు మంగళవారం ఉదయం పది గంటలకు ప్రారంభమవుతాయి. విజేతలకు రూ.64 వేలు విలువైన ప్రోత్సాహక నగదు బహుమతితోపాటు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు, నగదు బహుమతులు 'అభయ్ ఛారిటబుల్ ట్రస్ట్' కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోటీలకు దేశవ్యాప్తంగా రికార్డుస్థాయిలో 500 మందికిపైగా అగ్రశ్రేణి క్రీడాకారులతోపాటు ఫిడే (ప్రపంచ చదరంగం సమాఖ్య) టైటిల్ క్రీడాకారులు కూడా పాల్గొననున్నారని పేర్కొన్నారు.

ఏ గ్రామం.. ఎవరికి..?



ఎన్నికల పందేల్లో వింత పోకడలు

గ్రామాలవారీ అభ్యర్థికి వచ్చే ఓట్లు, మెజార్టీపై పందేలు

కుటుంబాలవారీగా లెక్కలు వేస్తూ బెట్టింగులు

ప్రతి నియోజకవర్గంలోనూ దాదాపు 70 వరకూ గ్రామాలు

గ్రామాల్లో తారాస్థాయికి పందేల జోరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల పందేలు వికృత రూపం దాల్చాయి. ప్రస్తుతం సాగుతున్న పందేల తీరు చూసి అంతా విస్తుపోతున్నారు. ఎన్నికల్లో అభ్యర్థి గెలుపోటములపై బెట్టింగులు సాగడం సాధారణంగా జరుగుతోంది. అయితే ఈసారి బెట్టింగుల విష సంస్కృతి కొత్త పుంతలు తొక్కుతోంది. అభ్యర్థి గెలుపోటములపై జరిగే పందేలు కాకుండా గ్రామాలవారీగా వచ్చే ఓట్లపైనే పందేల జోరు పెద్దఎత్తున సాగుతోంది. రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈసారి ఎన్నికలు నువ్వా నేనా అన్నట్లు సాగాయి. ప్రతి నియోజకవర్గంలోనూ ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారో కచ్చితంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. దీంతో బెట్టింగ్‌రాయుళ్లు మరింత రెచ్చిపోతున్నారు. ప్రతి మండలంలోనూ సరాసరిన 15 నుంచి 20 గ్రామాల వరకూ ఉన్నాయి. నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉంటే దాదాపు 70 వరకూ గ్రామాలు ఉన్న పరిస్థితి ఉంది. వైసిపి, టిడిపి కూటమి అభ్యర్థులకు ఏ గ్రామంలో ఎన్ని ఓట్లు వస్తాయి.. ఏ పార్టీ అభ్యర్థికి ఆ గ్రామంలో మెజార్టీ వస్తుంది అనే అంశాలపై పందేల జోరు సాగుతోంది. గ్రామంలో ఏ కుటుంబం ఏ పార్టీకి ఓటు వేసి ఉంటుందని అంచనాలు వేస్తూ ఆ బెట్టింగ్‌లకు దిగుతున్నారు. అభ్యర్థి గెలుపోటములపై జరిగే పందేల కంటే గ్రామాలవారీగా జరిగే బెట్టింగులు ఊహించని రీతిలో సాగుతున్నాయి. ఈ గ్రామంలో వైసిపికి రూ.వెయ్యి మెజార్టీ వస్తుందని ఒకరు పందెం కాస్తే.. అంత రాదని మరొకరు పందెం వేస్తున్నారు. ఫలానా గ్రామంలో టిడిపి కూటమి అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వస్తాయని ఒకరు, కాదు వైసిపి అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వస్తాయని మరొకరు పందేలు కాస్తున్నారు. ఇవి కోసు (ఒకటికి, రెండు) పందేల తరహాలో సాగుతున్నాయి. గ్రామాలవారీగా ఓట్లపై సాగుతున్న పందేల వైపు సామాన్య ప్రజానీకం ఆకర్షితులవుతున్నారు. ఈ పందేలు కనిష్టంగా రూ.పది వేల నుంచి రూ.పది లక్షల వరకూ సాగుతున్నట్లు చెబుతున్నారు. మధ్యవర్తులను పెట్టుకుని ఈ పందేలు వడుతున్నారు. గ్రామాలవారీగా ఓట్ల లెక్కల ప్రాతిపదికన అభ్యర్థి గెలుపు, మెజార్టీపై పందేలు వేస్తున్నారు. ఈ నెల 13న ఎన్నికలు జరిగాయి. జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. మధ్యలో 20 రోజులకుపైగా వ్యవధి ఉండటంతో ఎన్నికల పందేలు రోజురోజుకూ విశ్వరూపం దాల్చుతున్నాయి. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ గ్రామాలవారీ పందేలు సాగుతున్నాయి. జిల్లాలో ఉత్కంఠ రేపుతున్న ఆచంట, ఉండి, దెందులూరు, నూజివీడు వంటి నియోజకవర్గాల్లో ఈ పందేల జోరు మరింత ఎక్కువగా కన్పిస్తోంది. సామాన్యులు సైతం నలుగురు, ఐదుగురు కలిసి రూ.40 నుంచి రూ.50 వేలు జమ చేసి పందేలకు దిగుతున్నారు. దీంతో ఇంట్లో కుటుంబసభ్యులు గగ్గోలు పెడుతున్న పరిస్థితి ఏర్పడింది. జూన్‌లో స్కూళ్లు తెరుస్తారు. పిల్లల స్కూల్ ఫీజులు, యూనిఫారం, పుస్తకాలు వంటి అనేక ఖర్చులు ఉంటాయి. ఖరీఫ్ సీజన్‌సైతం ప్రారంభమవుతోంది. సార్వా సాగుకు పెట్టుబడులకు సొమ్ము అవసరం. ఈ తరుణంలో అప్పు చేసి మరీ ఎన్నికల పందేల్లోకి దిగడం కుటుంబ సభ్యులను తీవ్రంగా వేధిస్తోంది. కొంతమంది రెచ్చగొట్టి మరీ పందేలకు ఉసిగొల్పుతున్నారనే ఆరోపణలున్నాయి.

గెలిచిన అభ్యర్థులు కక్ష సాధించే ప్రమాదం

గ్రామాలవారీగా పందేలు వేస్తున్న తీరుపై ఆయా గ్రామాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక గ్రామంలో వైసిపికి ఎక్కువ ఓట్లు వచ్చి అక్కడ కూటమి అభ్యర్థి గెలిస్తే ఆ గ్రామంపై కక్ష తీర్చుకునే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. అదేవిధంగా మరో గ్రామంలో కూటమి అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వచ్చి వైసిపి అభ్యర్థి గెలిచినా అదే పరిస్థితి రానుందని చెబుతున్నారు. గతంలోలా గ్రామాలవారీగా ఓట్ల లెక్కలు వేసినప్పటికీ కౌంటింగ్ తర్వాత అంతా మరిచిపోయేవారు. ఇప్పుడు పందేలు సైతం గ్రామాలవారీగా జరుగుతుండటంతో కక్షలు పెరిగే ప్రమాదం ఉందని అంతా అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా ఏ కుటుంబం ఏ పార్టీకి ఓటు వేసిందనే అంచనాలు సైతం భవిష్యత్తులో ఇబ్బంది తెచ్చే ప్రమాదం కన్పిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి బెట్టింగ్‌లు జరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోందనే చర్చ నడుస్తోంది.



లోడ్ చేసేందుకు బాక్సుల్లో వేస్తున్న మామిడికాయలు

మామిడి రైతు కుదేలు

తగ్గిన దిగుబడి.. పెరిగిన పెట్టుబడి

తెగుళ్లతో పంట నాశనం

కొరవడిన వ్యవసాయాధికారుల పర్యవేక్షణ

గతేడాది ధర లేకపోవడంతో నష్టం

ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి




మార్కెట్‌లో మామిడికాయలు

మామిడిని పండించే రైతు అనునిత్యం మార్కెట్‌లోనూ, తెగులతో ఎప్పటి మాదిరిగానే కుదేలవుతున్నాడు. గతేడాది దిగుబడి ఎక్కువగా ఉందనుకున్న రైతులకు మార్కెట్‌లో ధర తక్కువగా ఉండడంతో తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉందనుకునే సమయంలో దిగుబడి తక్కువగా ఉండడంతో రైతులు కుదేలైపోతున్నారు. చింతలపూడి, లింగపాలెం మండలాల్లో సుమారుగా రెండు వేల ఎకరాల్లో మామిడిపంట సాగవుతుంది. ఈ ఏడాది మామిడి పూత అనుకూలంగా వచ్చినా తేనె మంచు తెగులు వచ్చి పూత మొత్తం మాడిపోయిన పరిస్థితి నెలకొంది. గతంలో రెండు మూడు సార్లు పురుగు మందులు కొడితే సరిపోయేది, తేనె మంచు పురుగు ఎక్కువగా ఉండటంతో ఈ సంవత్సరం పదిసార్లు పురుగు ముందు కొట్టాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతలో కంటే ఈ ఏడాది పెట్టుబడులు ఎక్కువయ్యాయని, పూత అంతా పిందగా మారి కాయగా రాకపోవడంతో దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు.

గతేడాది మా ర్కెట్‌లో బంగినపల్లి మామిడికాయలకు టన్ను రూ.ఐదు వేల నుంచి రూ.15 వేల వరకు ఉండగా, ఈ ఏడాది మార్కెట్‌లో రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ధర ఉంది. ధర ఎక్కువగా ఉందనుకున్న సమయంలో అనుకున్నంత దిగుబడి రాకపోవడంతో కనీసం పెట్టుబడులైనా వస్తాయో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 15 రోజుల్లోనే ఒక్కసారిగా ధరలు పతనమై పరిస్థితులు తారు మారయ్యాయి. మార్కె ట్‌కు భారీగా పంట తరలి రావడాన్ని తమకు అనుకూలంగా మార్చుకున్న వ్యాపారులు ధరలు అమాంతం తగ్గించేశారన్న విమర్శలు ఉన్నాయి. అసలే అంతంతమాత్రంగా కాసిన మామిడికి పెట్టుబడులు వస్తాయో, రావోనన్న ఆందోళనలో ఉన్న రైతులను ఈదురుగాలులు, వర్షం మరింత కలవరపరిచాయి. గతంలో లేని విధంగా తేనె మంచు పురుగులు ఇతర పురుగులు, మామిడిపూతను నాశనం చేశాయని, పిందగా మారకుండా పూత పూర్తిగా మాడిపోయిందని, మందులు ఎన్ని కొట్టినా ఫలితం లేకుండా పోయిందని, దీంతో దిగుబడి తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి కనీసం ఏ పురుగు మందులు వాడాలో చెప్పలేదని, కనీసం అవగాహన కల్పించలేదని రైతులు వాపోతున్నారు. రైతులకు అధికారులు తగిన సూచనలు సలహాలు ఇచ్చినట్లయితే కొంతవరకు తెగులు సమస్య నుంచి బయటపడే అవకాశం ఉండేదని అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మోరంపూడి వెంకటేశ్వరరావు, రైతు, చింతలపూడి



గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది దిగుబడి తగ్గింది. మామిడి పంట ధర కొంచెం పెరిగింది. తేనె మంచు పురుగుతో పంటను తీవ్రంగా నష్టపోయాం. అధికారులు సూచనలు, సలహాలు ఇస్తే బాగుండేది. ప్రభుత్వమే మామిడి పంట రైతులకు మేలుకు కలిగే విధంగా ఏదో ఒకటి చేయాలి.

విజ్ఞాన కేంద్రాలు.. వేసవి వినోద శిబిరాలు

బాల బాలికల్లో వినోదంతోపాటు సైన్స్, సృజనాత్మకత పెంపు

చిల్డ్రన్స్ క్లబ్ కృషి పట్ల సర్వత్రా హర్షం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రపంచ దేశాల్లో భారతదేశం వెనుకబడి ఉండటానికి కారణాల్లో ఒకటి మూఢ నమ్మకాలు... దేశం వెలిగిపోతుందని, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మొదటి స్థానంలో ఉందని, ప్రపంచం అంతా భారతదేశం వైపే చూస్తుందని పాలకులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో దానికి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఈ సమాజంలో మార్పు కోసం కందుకూరి వీరేశలింగం, జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్ వంటి సంఘసంస్కర్తలు, ఎందరో మహానుభావులు కృషి చేసినప్పటికీ ఫలితాలు పరిమితంగానే వచ్చాయి. ప్రస్తుత పాలకుల తీరు, సోషల్ మీడియా ఈ మూఢనమ్మకాలను మరింత పెంచి పోషిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో బాల్యం నుంచే విద్యార్థుల్లో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించి సైన్స్ ప్రయోజనాలు, ప్రాముఖ్యత, జీవితంలో సైన్స్ పాత్ర గురించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నారు హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకులు.

ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల సాధన సమితి తదితర సంఘాలతో సమన్వయం చేసుకుని ఏలూరు నగరంలో 20 కేంద్రాల్లో దిగ్విజయంగా వేసవి వినోద శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. హేలపురి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరులో ఐదు సంవత్సరాల నుండి ప్రతియేటా వేసవి సెలవుల్లో విద్యార్థులకు వేసవి వినోద శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం ప్రస్తుతం ఏలూరులో గన్‌బజార్, వంగాయగూడెం, పోణంగి వైఎస్ఆర్ కాలనీ, బాలల గ్రంథాలయం, జిల్లా కేంద్ర గ్రంథాలయం, శనివారపుపేట, సుందరయ్య కాలనీ, తంగెళ్లమూడి, గాంధీనగర్, అల్లూరి సీతారామరాజు కాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు 20 కేంద్రాల్లో ఈ సమ్మర్ క్యాంపులు నడుపుతున్నారు. సెలవుల్లో ఇంటి వద్దనే ఉండే విద్యార్థులకు వారి నివాస ప్రాంతాల్లోనే శిబిరాలు ఏర్పాటు చేశారు. విద్యతోపాటు సమాజంలో అనేక సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించడం, మూఢనమ్మకాలను పారదోలుతూ సైన్స్ భావజాలం పెంపొందించేలా ఈ క్యాంపుల్లో నేర్పుతున్నారు. విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, వికాసం కలిగించేలా ఆటలు, పాటలు, డ్యాన్స్, కోలాటం, డ్రాయింగ్, బెస్ట్ ఫ్రం వేస్ట్ వంటివి నేర్పుతున్నారు. ఆడ పిల్లలకు ఆత్మ రక్షణకు ఉపయోగపడే కరాటే, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ వంటి సెల్ఫ్ టెక్నిక్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. సమాజ శ్రేయస్సుకు పాటుపడిన స్వాతంత్ర సమరయోధులు, జాతీయ నాయకులు, సంఘ సంస్కర్తలు, మహానేతల జీవిత చరిత్ర విశేషాలను వీడియోల ద్వారా పిల్లలకు తెలియజేస్తున్నారు. సమాజంలో తల్లిదండ్రులు, పెద్దలు, గురువులను గౌరవించడం, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించేలా పిల్లల్లో ఆలోచనలు రేకెత్తిస్తున్నారు. సెలవు రోజులు కావడంతో విద్యార్థులు చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంపుల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రతి క్యాంపులో సుమారు 20 నుంచి గరిష్టంగా 50 మంది వరకు పాల్గొంటున్నారు. ఏప్రిల్ 27న ప్రారంభమైన ఈ క్యాంపులు ఈ నెల 10వ తేదీ వరకు నడిచాయి. అనంతరం ఎన్నికల కారణంగా ఐదు రోజులు విరామం ఇచ్చి మళ్లీ మే 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో ఈ నెల 30వ తేదీ వరకు, మరికొన్ని కేంద్రాల్లో జూన్ ఏడో తేదీ వరకు ఈ క్యాంపులు జరగనున్నాయి. మూఢ నమ్మకాలను బాల బాలికలకు వివరించి సైన్స్ ప్రయోగాల ద్వారా నిజాలను పిల్లలకు అర్థమయ్యేలా తెలియజేస్తున్నారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా చిన్నచిన్న డ్రామాలు ప్రదర్శించడం, దొంగ బాబాలు చేసే చిన్న చిన్న ట్రిక్స్‌ను మ్యాజిక్ షో ద్వారా బహిర్గతం చేయడం వంటివి చేసి అన్నింటికీ మూలం సైన్స్ మాత్రమే అని తెలియజేస్తున్నారు. అంతేకాక చిత్రలేఖనంలో పెన్సిల్ ఆర్ట్, పెయింటింగ్ వంటివి విద్యార్థులకు నేర్పిస్తున్నారు. పాటలు పాడటం, పద్యాలు, వాటి భావం నేర్పించడం, నీతి కథలు నేర్పించడం వంటివి చేస్తున్నారు. ఉదయం 8:30 గంటల నుంచి 11:30 వరకు సాగే ఈ క్యాంపుల్లో విద్యార్థులకు అల్పాహారం, మజ్జిగ, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, లస్సీ వంటివి అందిస్తున్నారు. వేసవి సెలవుల్లో టీవీలతోనూ, సెల్‌ఫోన్లతోనూ విద్యార్థులు కాలక్షేపం చేయకుండా ఇటు సమాజం పట్ల అవగాహన, బాధ్యత అలవర్చుకోవడంతోపాటు నమ్మకాలకు, నిజాలకు మధ్య వ్యత్యాసం ఉంటుందనే విషయాన్ని సైన్స్ ద్వారా గ్రహించి దేశ భవిష్యత్తు కోసం, మెరుగైన సమాజం కోసం విద్యార్థులు భవిష్యత్తులో పాటుపడేందుకు ఈ సమ్మర్ క్యాంపులు ఎంతగానో ఉపయోగపడతాయి అనేందుకు ఎలాంటి సందేహమూ లేదు. భవిష్యత్తులో ఇలాంటి సమ్మర్ క్యాంపులు మరిన్ని నిర్వహించాలనేది అందరి ఆకాంక్ష.



వైఎంహెచ్ఎ బాలల గ్రంథాలయంలో వ్యాసరచనలో శిక్షణ



జిల్లా శాఖ గ్రంథాలయంలో డ్రాయింగ్‌లో శిక్షణ



దాతలు సహకరిస్తే మరిన్ని క్యాంపులు

పి.దుర్గాప్రసాద్, హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి



ఐదు సంవత్సరాలుగా ఈ సమ్మర్ క్యాంపులు మా హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ ద్వారా నిర్వహిస్తున్నాం. గతంలో ఎక్కువగా పెద్దలు ఈ క్యాంపుల్లో పాలుపంచుకునేవారు. అయితే ఇప్పుడు యువత ముందుకొచ్చింది. 40 మంది యువకులు ఈ సమ్మర్ క్యాంపుల్లో తమ సహకారం అందిస్తున్నారు. దాతలు సహకరిస్తే భవిష్యత్తులో ఇటువంటి సమ్మర్ క్యాంపులు మరింత ఉత్సాహంగా, మరిన్ని కేంద్రాల్లో మరింత ఎక్కువ మంది విద్యార్థులతో నిర్వహిస్తాం.

మంచి పౌరులను అందించాలన్నదే లక్ష్యం

పి.హైమావతి. ఐద్వా జిల్లా అధ్యక్షులు, చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకులు



మేధావులు రచించిన రాజ్యాంగాన్ని కాలరాసి, మనువాదాన్ని తమ రాజ్యాంగంగా ముందుకు తేవాలని చూస్తున్న ప్రస్తుత పాలకుల తీరు చూస్తుంటే భారతదేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో విద్యార్థి దశ నుంచే పిల్లలకు మూఢ నమ్మకాలపై అవగాహన, సైన్స్ ప్రయోజనాలు, సమాజం పట్ల బాధ్యత నేర్పించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా బాలికలకు స్వీయ రక్షణ అవసరం. అందుకే ఈ సమ్మర్ క్యాంపుల ద్వారా ప్రతి అంశంలో బాల బాలికలకు శిక్షణ ఇస్తున్నాం. భవిష్యత్తులో ఈ క్యాంపుల సంఖ్య పెంచి మరింత మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఈ దేశానికి మంచి పౌరులను అందించాలన్నదే మా లక్ష్యం.

కిలో చేప @ 20

తేలిపోయిన చేప, రొయ్య

కిటకిటలాడిన మార్కెట్

ప్రజాశక్తి - ఆకివీడు

వాతావరణంలో పెనుమార్పులతో గత రెండు రోజుల్లో చేపల చెరువుల్లో డిఒ (ఆక్సిజన్‌లో హెచ్చుతగ్గులు) ఒక్కసారిగా పడిపోయింది. దీనికితోడు ఆదివారం ఎండ తీవ్రత అనూహ్యంగా పెరిగింది. ఇక చెప్పేదేముంది చావు బతుకుల మధ్య ఉన్న చేపలు సైతం ఒకసారి తేలిపోయాయి. శని, ఆదివారాల్లో తిరగబడ్డ చేపలను వెంటనే ఏరించి రైతు మార్కెట్‌కు తరలించాడు. రొయ్య పరిస్థితీ అంతే. దీంతో ఆదివారం స్థానిక చేపల మార్కెట్ కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో చేపల లోడింగ్ వాహనాలు వచ్చాయి. చెరువుల్లో పట్టుబడి పట్టిన చేప అప్పటికప్పుడు ఐస్‌లో వేసి ఎగుమతి చేసే పరిస్థితి ఉంటుంది. అయితే ఇప్పుడు రైతులు తెచ్చిన చేప కనీసం 12 గంటల నుండి 24 గంటలు క్రితమే చెరువులో తిరగబడిపోయిన పరిస్థితి. దీంతో ఇది ఎగుమతికి పనికి రాదు. దీంతో రైతులు ఎంతొచ్చినా చాలు అంటూ స్థానిక మార్కెట్‌కు చేపలను తరలించడంతో నిన్నటి వరకూ రూ.150 నుంచి రూ.300 వరకూ పలికిన ధర రూ.20 నుంచి రూ.50 వరకే పరిమితమైంది. ఒక దశలో చేపలు అమ్ముడుకాక గాల్లో విసిరేశారు. గత ఆరు నుంచి ఎనిమిది నెలలుగా చేపను పెంచిన రైతులు పంట చేతికొస్తుందనుకున్న తరుణంలో కనీసం పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి ఏర్పడిందని లబోదిబోమంటున్నారు.



హడావుడిగా పట్టుబడి పడుతున్న రైతులు



ఆకివీడు మార్కెట్‌లో వెల్లువల వచ్చిన చేపలు

ఆరు నెలల కష్టం నాశనమైంది

ఆర్.కృష్ణ, చేపల రైతు, ఎన్‌టిఆర్ జిల్లా

ఆరు నెలల కష్టం మొత్తం నాశనమైంది. మళ్లీ అప్పు చేసి సాగు చేయాల్సిందే. కిలో రూ.250 పలుకుతుందని ఆశించిన చేప రూ.40కే అమ్మాల్సి వచ్చింది. ఇంత దారుణం ఎప్పుడూ లేదు.

నాలుగు రెట్లు ఎక్కువ చేపలొచ్చాయి

అల్లాడి అంజిబాబు, చేపలవ్యాపారి, ఆకివీడు



ప్రతిరోజూ ఈ మార్కెట్‌లో 10 టన్నులకుపైగా చేపల ఎగుమతులు, అమ్మకాలు సాగుతుంటాయి. అయితే ఈ రోజు అనూహ్యంగా రోజుకన్నా నాలుగు రెట్లు చేపలు మార్కెట్‌కు వచ్చి పడ్డాయి. దీంతో కిలో రూ.20కే చేపలు అమ్మేస్తున్నాం.

వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించాలి

సిపిఎం బృందం డిమాండ్

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేట గ్రామంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారిని సిపిఎం బృందం ఆదివారం పరామర్శించింది. సిపిఎం బృందం మెడికల్ క్యాంపు వద్ద అధికారుల నుండి వివరాలు సేకరించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు మాట్లాడుతూ జ్వరాలు పూర్తిగా తగ్గేవరకూ మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అలాగే జ్వర బాధితులంతా నిరుపేదల కుటుంబాలని, నిత్యావసర సరుకులను బాధిత కుటుంబాలకు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. డాక్టర్ దుర్గాప్రసాద్‌తో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఆనందం మాట్లాడుతూ ఎందువల్ల జ్వరాలు వచ్చాయనే అంశంపై త్వరితగతిన నిర్ధారించి, నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హోలీ మేరీ తదితరులు పాల్గొన్నారు.



జ్వర బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు హైస్కూల్లో 35 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న 1990వ సంవత్సరపు విద్యార్థులు ఆదివారం పాఠశాలలో బాల్య మిత్రుల ఆత్మీయ సంగమం పేర కలిశారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. దాదాపుగా జీవితంలో స్థిరపడిన వీరందరూ ఈ విధమైన సమావేశం నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. రానున్న కాలంలో సైతం ఈ విధంగా కలవాలని ఆకాంక్షించారు.



పూర్వ విద్యార్థులు

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో పర్యాటకులతో ఆదివారం కలకల్లాడింది. ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. వాళ్లు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు బీచ్‌కు వచ్చి సేద తీరారు.



పేరుపాలెం బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు



ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చిన్నారులు

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతుంది. వివిధ పాఠశాలల విద్యార్థులు క్రమం తప్పకుండా శిక్షణ శిబిరానికి హాజరవుతున్నారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 11:30 గంటల వరకు రిసోర్స్‌పర్సన్లు డి.శ్రీవల్లి, జి.కళ్యాణి, ప్రముఖ హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ సెక్రటరీ పి.దుర్గాప్రసాద్ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మైండ్ మెమరీ పవర్ గేమ్స్, నీతి కథలు చదివిస్తూ, విద్యార్థుల చేత కథల్లోని నీతిని చెప్పించారు. సరదాగేమ్స్, బెలూన్, డిస్పోజల్ గ్లాసులతో రిసోర్స్ పర్సన్లు వెరైటీ గేమ్స్ ఆడించారు. ఈ వేసవి శిబిరం అనంతరం కూడా ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలకు వచ్చి మంచి విజ్ఞానం సంపాదించుకోవాలన్నారు. ఈ శిక్షణ శిబిరం కార్యక్రమాలను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు. విద్యార్థులందరికీ స్నాక్స్ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది విటి.సందీప్‌కుమార్, ఎండి ఎ.అస్లాం పాషా, ఎం.కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.



ముదినేపల్లి : గురజలో చిన్నారులకు ఆటల పోటీలు

గురజలో ఆటల పోటీలు

ముదినేపల్లి : ముదినేపల్లి, గురజ గ్రామాల్లోని శాఖ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు ఆదివారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, ఆటలు, పాటలు పోటీలు నిర్వహించారు. ఆయా గ్రంథాలయాల అధికారిణిలు ఎం.శ్రీదేవి, ఝాన్సీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన అంశాలపై అవగాహన కల్పించారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతపర్చాలి

శిక్షణా శిబిరంలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

2024-2025 సంవత్సరపు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి క్లబ్ ఆఫీసర్ల శిక్షణా శిబిరం ఏలూరు గ్రీన్ సిటీలో ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో లయన్స్ జిల్లా 316 జి గ్లోబల్ లీడర్‌షిప్ ట్రైనింగ్ అధి నాయకులు నం దుల సీతా రామారావు అధ్యక్షతన ఆదివారం నిర్వ హించారు. ముం దుగా లయన్స్ సంస్థ



మాట్లాడుతున్న వక్తలు

పితామహుడు మెల్విన్ జోన్స్ చిత్రపటానికి జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ యార్లగడ్డ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు జులై నెల నుంచి కాబోయే క్లబ్ నాయకులైన క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, అడ్మినిస్ట్రేటర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించి, ఉత్తమ సేవలందించాలి, సమాజంలో ఎదగాలనే భావనతో చక్కటి లీడర్లను తయారు చేయటం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. విశిష్ట అతిథి, మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్మన్, శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ లయన్స్ సేవలను ప్రతి పల్లెటూరికి, ప్రతి సామాన్యుడికి చేరేలా విస్తరింపజేయాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లకు లయన్స్ సేవా కో-ఆర్డినేటర్లు సహకరించి సేవలందించాలన్నారు. 2024-25 జిల్లా గవర్నర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టబోయే కాకరాల వేణుబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒక్కొక్క మెట్టు పైకి ఎదుగుతూ లయన్స్ సేవలు ప్రజలకు చేరువ చేస్తున్న లయన్స్ కంటి ఆసుపత్రులు, కిడ్నీ డయాలసిస్ సెంటర్లు, పర్మనెంట్ ప్రాజెక్టులుగా పిలవబడే వివిధ రకాల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా మనందరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా ప్రథమ వైస్ గవర్నర్ పాపారావునాయుడు, ఫ్యాకల్టీ, పూర్వపు జిల్లా గవర్నర్లు డాక్టర్ పి.విజయభాస్కరరెడ్డి, వి.మురళీమోహనరావు, జిల్లా నాయకులు ఎం.శ్రీహరి, వి.రామారావు, వి.సత్యస్వరూప్, ఎల్.వెంకటేశ్వరరావు, వివి.స్వామి పాల్గొన్నారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ వికె.పంకజాక్షన్ వ్యవహరించారు. రీజియన్ చైర్‌పర్సన్ ఎం.కృష్ణమోహన్, వి.రత్నకుమార్ కార్యక్రమానికి ఆతిథ్యాన్ని అందించారు.

మోడీ విష ప్రచారం తగదు

ప్రజాశక్తి - కామవరపుకోట

ఇండియా వేదిక విజయం సాధిస్తే ముస్లిముల మెప్పు కోసం రాజ్యాంగాన్ని మారుస్తుందని, దళిత బిసి బలహీన తరగతులకు రిజర్వేషన్లు తీసేసి ముస్లిములకు కట్టబెడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విష ప్రచారం చేస్తున్నారని సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టివిఎస్.రాజు, సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు అన్నారు. పార్లమెంట్‌లో 400 స్థానాలు వస్తే అంబేద్కర్ రాజ్యాంగాన్ని మార్చి ఆర్‌ఎస్ఎస్ రాజ్యాంగాన్ని అమలు చేస్తామని నిస్సిగ్గుగా ప్రచారం చేసుకుంటున్న బిజెపి, సంఘపరివారశక్తులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. రానున్నది ఇండియా వేదిక ప్రభుత్వమేనన్నారు.

సంగీత శిక్షణ శిబిరం చిన్నారులకు సర్టిఫికెట్లు

ప్రజాశక్తి - ఏలూరు

దయామణి మెమోరియల్ బ్లెస్సింగ్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో వేసవి శిబిరంలో భాగంగా నెలరోజుల పాటు వివిధ సంగీత పరికరాలపై శిక్షణ పొందిన 270 మంది చిన్నారులకు ప్రముఖ అంతర్జాతీయ దైవ వార్తమానికులు పాస్టర్ ఎం.జ్యోతిరాజు సర్టిఫికెట్స్, మెమంటోస్ అందించారు. ఆదివారం ఏలూరులోని సిఎస్ఐ మైదానంలో సర్టిఫికెట్స్ అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. పాడ్స్‌లో 70 మంది, కీ బోర్డులో 130 మంది, గిటార్‌లో 30 మంది, తబలాలో 40 మంది మొత్తం 270 మంది శిక్షణ పొందగా, వీరంతా ఆయా విభాగాల్లో తమ ప్రతిభను చాటారు. పాస్టర్ ఎం.జ్యోతిరాజు, క్వాయోర్ టీం క్రిస్తవ గీతాలను ఆలపించగా వాటికి చిన్నారులు లయ బద్ధంగా చక్కని సంగీతాన్ని వినిపించారు. నగరానికి చెందిన అనేక మంది ప్రముఖ సంగీత దర్శకులు, గాయకులు, తల్లిదండ్రులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గ్యాస్ సిలిండర్ పేలి నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - ముసునూరు

గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు గాయాలపాలైన ఘటన కృష్ణాజిల్లా బాపులంపాడు మండలం రేమల్లె గ్రామ పరిధిలోని మోహన్ స్పిన్‌టెక్స్ క్వార్టర్స్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం అదిలాబాద్‌కు చెందిన సాయినాథ్, లక్ష్మీబాయ్ దంపతులు మోహన్ స్పిన్‌టెక్స్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం డ్యూటీ ముగించుకుని వారి క్వార్టర్స్‌కి వెళ్లారు. రాత్రి సమయంలో వంట చేసుకుందామని గ్యాస్ పొయ్యి వెలిగించగా ఒక్కసారిగా సిలిండర్ పేలడంతో ఆ దంపతులతో పాటు వారి కుమారుడు దేవరాజ్, సాయినాథ్ అక్క వనిత నలుగురు గాయాలపాలయ్యారు. వారిని ఫ్యాక్టరీ సిబ్బంది నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అత్యుత్తమ ఫలితాలు శశితోనే సాధ్యం

హైస్కూల్ కరస్పాండెంట్ జివి.సత్యనారాయణరాజు

ప్రజాశక్తి - కలిదిండి



సత్యనారాయణరాజు

అత్యుత్తమ ఫలితాల సాధనే శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ధ్యేయమని కరస్పాండెంట్ జివి.సత్యనారాయణరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్థానికంగా విశాలమైన ఆట స్థలంతో శశి హైస్కూల్ నూతన క్యాంపస్ రూపు దిద్దుకుందని చెప్పారు. అత్యంత అనుభవం, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో భోధనతో పాటు క్లిష్టమైన విషయాలు సులభంగా బోధించేందుకు డిజిటల్ ల్యాబ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులకు క్లాసికల్, వెస్టర్న్ డ్యాన్సులలో శిక్షణ, కరాటేలో విద్యార్థులందరికీ ఉచిత శిక్షణ ఇస్తూ వారిలోని ప్రతిభను వెలికి తీస్తున్నామన్నారు. అందువల్లే తమ విద్యార్థులు కరాటథేలో జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్స్‌లో గోల్డ్‌మెడల్స్‌ను సాధించారన్నారు. తరగతి బోధనతో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కోసం లైబ్రరీ సదుపాయం కల్పించామన్నారు. ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు.



కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

విద్యాపరంగాను పదో తరగతి ఫలితాల్లో 2021-22, 2022-23 ఏడాది మండల స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించినట్లు చెప్పారు. అదే ఒరవడితో రాజీ పడకుండా విద్యావిధానంలో ముందుకు సాగుతున్నామన్నారు. విద్యార్థుల సౌలభ్యం కోసం బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వం, ఆత్మస్థైర్యం, జ్ఞానం పెంపొందేలా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నామన్నారు. శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులను చేర్చి వారి బంగారు భవితకు బాటలు వేయాలని కరస్పాండెంట్ జివి.సత్యనారాయణ రాజు కోరారు.

ఉత్తమ విద్యాబోధన న్యూ కీర్తి సొంతం

కరస్పాండెంట్ ఎన్.సంజీవ్‌కుమార్



సంజీవ్‌కుమార్



న్యూ కీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని దొరసానిపాడు గ్రామంలో ఉన్న న్యూ కీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉత్తమ విద్యా బోధన, నూరుశాతం ఉత్తీర్ణతతో ముందుకు సాగుతుందని స్కూల్ కరస్పాండెంట్ ఎన్.సంజీవ్‌కుమార్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పాఠశాల స్థాపించి 14 ఏళ్లు పూర్తయిందని, తక్కువ ఫీజు ఉత్తమ విద్యా ప్రమాణాలతో ముందుకు సాగుతున్నామని, వంద శాతం ఉత్తీర్ణత ధ్యేయంగా స్కూల్‌ని నడిపిస్తున్నామని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, డిజిటల్ క్లాస్ రూమ్ విత్ ప్రొజెక్టర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్యూరిఫైడ్ మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నామని, ట్రాన్స్‌ఫోర్ట్ ఫెసిలిటీ కలగజేస్తున్నామని చెప్పారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యా బోధన చేస్తున్నామన్నారు. పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించామని 576 మార్కులు సాధించి కె.హర్షిని ప్రథమ స్థానంలో, 561 మార్కులు సాధించి పి.నాగాంజలి ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. స్కూల్‌లో ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలు ఆడుకునేందుకు విశాలమైన ప్లేగ్రౌండ్, ప్లేయింగ్ ఐటమ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి సంవత్సరం స్కూల్ అన్యువల్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు.



హర్షిణి

స్కూల్ పిల్లలకు కోలాటం, భరతనాట్యం, డ్యాన్స్ క్లాసులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ జి.నాగదివ్య మాట్లాడుతూ స్కూల్‌ను మరింత ముందుకు తీసుకువెళ్తామని, స్కూల్ అభివృద్ధికి, ఉత్తీర్ణతా శాతం పెంచడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నామని తెలిపారు.

పలుచోట్ల భారీ అన్న సమారాధనలు



భీమడోలులో....

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని రెండు వేర్వేరు గ్రామాల్లో ఉన్న ప్రముఖ ఆలయాల వద్ద ఆదివారం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఫైర్ స్టేషన్ వద్ద ఉన్న సాయిబాబా ఆలయం వద్ద ఆలయం 37వ వార్షికోత్సవం సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. గుండుగొలను వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారి కళ్యాణ మహోత్సవాలు పురస్కరించుకుని అన్న సమారాధన కార్యక్రమాన్ని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అన్న ప్రసాద వితరణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలాదిగా ప్రజలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



ముదినేపల్లిలో...

ముదినేపల్లి :మండలంలోని వడాలిలో జరుగుతున్న శ్రీ జగన్నాథ స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆదివారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్న సమాధానం కార్యక్రమాన్ని ముదినేపల్లి తహశీల్దార్ ఎస్.లక్ష్మీనరసకుమారి వడ్డన చేసి ప్రారంభించారు. ఈ సమారాధనలో వడాలి, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఇవిఎంలకు పటిష్ట భద్రత

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ భద్రతా చర్యలను ఎస్‌పి డి.మేరీప్రశాంతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పటిష్టమైన మూడంచెల భద్రత నడుమ బ్యాలట్ బాక్స్‌ల స్ట్రాంగ్ రూమ్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు విధులు సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్, పరిసరాల్లో సీసీ టివి కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌కి నలువైపులా పోలీస్ పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ గార్డ్ సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలని ఆదేశాలు ఇచ్చారు.

పంట కాలువ గట్లు తవ్వేస్తున్నారు..!

పట్టించుకోని అధికారులు

గురజ గ్రామస్తుల వేడుకోలు



తవ్వేసిన పంట కాలువ గట్టు

ప్రజాశక్తి - ముదినేపల్లి

అక్రమ ధనార్జనే ధ్యేయంగా కొందరు బడాబాబులు పంట కాలువ గట్లను యదేచ్ఛగా తవ్వేస్తున్నారు. తవ్విన మట్టిని ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించి అమ్ముకుంటూ అక్రమార్జన గడిస్తూ రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారు. ఎవరికంట పడకుండా అర్ధరాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా ఈ తంతు జరుగుతుంది. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము నాలుగు గంటల వరకు ఈ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన అంకారావు చేను సరిహద్దు నుంచి కాలువ గట్టు పొడవున అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ విషయమై గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గురజ ఆయకట్టు పరిధిలో అలుగు కాలవ గట్టును అర్ధరాత్రి సమయంలో జెసిబితో తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్లతో మట్టిని గ్రామంలోకి తరలించి అమ్ముకుంటున్నారు. ట్రాక్టర్ ట్రక్కు మట్టి ధర రూ.1500 వరకు పలుకుతుంది. ఈ తంతు గత మూడు రోజులుగా అర్ధరాత్రి సమయాల్లో జరుగుతుంది. కొందరు బడాబాబులు తమ చేల సరిహద్దుగా ఉన్న ప్రభుత్వ కాల్వ గట్లు తవ్వేస్తూ తమ చేలల్లో కలుపుకుంటున్నారు. ఒక్కో బడా రైతు 25 సెంట్ల చొప్పున కాల్వ గట్టు తవ్వేస్తూ తన చేలో కలిపేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్తులు విఆర్ఒకు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోవటం లేదంటూ గ్రామస్తులు చెబుతున్నారు. ఈ తంతు అంతా విఆర్ఒ పవన్, విఆర్ఎ సునీల్ కనుసన్నల్లో జరుగుతున్నట్లు గ్రామస్తుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. జోరుగా జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి కాలువ గట్లను తవ్వేస్తూ అక్రమార్జన గడిస్తున్న బడాబాబులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లక్కవరంలో లోపించిన పారిశుధ్యం

ఎక్కడపడితే అక్కడే చెత్తాచెదారం

దుర్వాసనతో గ్రామస్తుల ఇబ్బందులు

విజృంభిస్తున్న దోమలు


పట్టించుకోని అధికారులు



రోడ్డు వెంబడి పేరుకుపోయిన చెత్తాచెదారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని లక్కవరం గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. దీంతో అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్కవరం ఒక మేజర్ పంచాయతీ అయినా పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పాతకాలం నాటి పద్ధతిలోనే బతుకుతున్నామని లక్కవరంలో ఎస్‌టి కాలనీలో నివాసం ఉంటున్న బిసిలు వాపోతున్నారు. టెక్నాలజీ మారుతున్న రోజుల్లో అభివృద్ధి జరుగుతుందనే ఆలోచన ప్రజల్లో ఒక నిరాశగానే మిగిలిపోతుందని లక్కవరం ప్రజానీకం నిస్పృహ చెందుతదున్నారు. కనీసం నడిచేందుకు కూడా రోడ్డు సక్రమంగా లేదని వాపోతున్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వర్షం వస్తే దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దీంతో రోగాల బారిన పడతామని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అసలు పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. ఓట్లు అడగడానికి వచ్చిన రాజకీయ నాయకులు ఆ బురద గుంటలో, ఆ చెత్త కుప్పల్లో దాటుకుంటూ వచ్చి, వెళ్లారే తప్ప అక్కడ సమస్యలను, ప్రజల ఇబ్బందులను గుర్తించి పరిష్కరించాలనే ఆలోచన కూడా వారికి రాలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. గ్రామసభలో చెప్పే మాటలన్నీ గాలిలో కలిసిపోతున్నామని గ్రామస్తులు విమర్శలు చేస్తున్నారు. గ్రామంలో ఏ మూల చూసినా ఇదే దుస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా, మండల అధికారులు గ్రామాల్లో పర్యవేక్షించకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఒకప్పుడు ఇఒపిఆర్‌డిలు తెల్లవారుజాము ఐదు గంటలకు గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించేవారని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేవారని, ప్రస్తుతం అటువంటివి ఏమీ కానరావడంలేదని గ్రామస్తులు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రానున్న వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా చెత్తాచెదారం వ్యర్థాలను తొలగించాలని లక్కవరం గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



రోడ్డును ఆనుకుని మురికికూపం

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఈ నెల 27, 28 తేదీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రాధాకష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజుపోతేపల్లి 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తగూడెంలో 11 కెవి ఫీడర్ ఆర్‌డిఎస్ఎస్ పనులు చేపట్టడం వల్ల ఈ నెల 27, 28 తేదీల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెండు రోజుల పాటు మరమ్మతుల పనులు జరుగుతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కామవరపుకోటలో...

కామవరపుకోట : 33/11 కెవి యడవల్లి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కెవి తాడిచెర్ల ఫీడర్ పరిధిలో 27వ తేదీ సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రాధాకృష్ణ తెలిపారు. 33/11 కెవి తాడిచర్ల కొత్త విద్యుత్ ఉపకేంద్రాని 33 కెవి లైన్ వేయనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అలాగే వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు ఉంటాయని తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలని రాధాకృష్ణ కోరారు.

గ్రామాలాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమికి బాసటగా నిలిచిన ప్రతి గ్రామానికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నానని, నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి గ్రామ కమిటీలు, స్థానిక ప్రజల సమన్వయంతో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని టిడిపి దెందులూరు ఎంఎల్ఎ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దెందులూరు నియోజక వర్గంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఉదయం దుగ్గిరాలలోని కార్యాలయంలో చింతమనేని ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. తమ గ్రామాల్లో జరిగిన పోలింగ్ సరళని చింతమనేని ప్రభాకర్‌కు వివరించారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ పెదపాడు మండలాధ్యక్షులు లావేటి శ్రీనివాస్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌హెచ్ అని చెక్కిన అభిమాని

పెన్సిల్‌పై ఎస్ఆర్‌హెచ్ ఆర్ట్

ప్రజాశక్తి - నరసాపురం

చెన్నైలో జరుగుతున్న ఐపిఎల్ ఫైనల్ మ్యాచ్‌లో కెకెఆర్, ఎస్ఆర్‌హెచ్ తలబడుతుంది. ఈ మ్యాచ్‌లో తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్‌కు చెందిన సన్‌రైజర్స్ గెలవాలని కోరుకుంటూ నరసాపురం పట్టణంకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ కొప్పినీడి విజయ్ పెన్సిల్ ముక్కుపై ఇంగ్లీషులో ఎస్ఆర్‌హెచ్ అని చెక్కి అభిమానాన్ని చాటుకున్నారు. విజయ్ వృత్తిరీత్యా మండలంలోని లిఖితపూడి సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తూ తన ప్రతిభను కనబరిచాడు.